క్లుప్తంగా

17 నుంచి సంతోషిమాత శ్రావణ ఉత్సవాలు


సంతోషిమాత అమ్మవారు

శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళంలోని సంతోషిమాత ఆలయంలో ఈనెల 17 నుంచి సెప్టెంబర్ 15వ తేదీ వరకు నిజ శ్రావణ మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు అర్చకుడు మోదుకూరి కిరణ్‌శర్మ బుధవారం తెలిపారు. ఈ పర్వదినాల్లో అమ్మవారికి ప్రత్యేక, నిత్య పూజలు, విశేష అర్చనలు, కుంకుమ పూజలు ఉంటాయి. 31వ తేదీన శ్రావణ పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు జరుగుతాయన్నారు. ఈ శ్రావణ మాసంలో ఐదు శుక్రవారాలు పడ్డాయన్నారు.

యోగా శిక్షణ తరగతులు ప్రారంభం


యోగా చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: భారతదేశమంతటా ఒకే సమయంలో ఆనందమైన జీవితానికి ఆనందోత్సవం కార్యక్రమంలో భాగంగా పెద్దపాడు రోడ్డులోని ఆర్ట్ ఆఫ్ లివింగ్ కేంద్రంలో ప్రత్యేక యోగా తరగతులు బుధవారం ప్రారంభమయ్యాయి. ఆర్ట్ ఆఫ్ లివింగ్ హ్యాపీనెస్ సెంటర్ సీనియర్ టీచర్, జిల్లా ప్రతినిధి డాక్టర్ కె.అమ్మన్నాయుడు వీటిని ప్రారంభించారు. ఆరు రోజులు శిక్షణ తరగతులుంటాయన్నారు. శిక్షణలో శ్వాస ప్రక్రియ, సుదర్శన క్రియ నేర్పిస్తున్నట్టు పేర్కొన్నారు. ఉదయం, సాయంత్రం రెండు బ్యాచ్‌లకు శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణలో 35 మంది పాల్గొన్నారని ఏవోఎల్ టీచర్ దేసూళ సురేంద్ర చెప్పారు. చివరి రోజున ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు రవిశంకర్ గురూజీ ప్రత్యక్ష ప్రసారం ఉంటుందన్నారు.

పశువైద్యాధికారికి సన్మానం


రమణను సన్మానిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్ర వెటనరీ సర్జన్ అసిస్టెంట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడుగా ఎచ్చెర్ల పశువైద్యాధికారి రమణ ఎంపికయ్యారు. దీంతో సిబ్బంది బుధవారం రమణను సత్కరించి అభినందించారు. సిబ్బంది సంక్షేమానికి కృషి చేయాలని కోరారు.

శతశాతం పంట నమోదు


మాట్లాడుతున్న సురేష్

ఎచ్చెర్ల క్యాంపస్: గ్రామ సచివాలయం యూనిట్‌గా శతశాతం పంటనమోదు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి వై.సురేష్ అన్నారు. ఎచ్చెర్ల మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారులకు ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈక్రాప్ నమోదు, పంటకోత ప్రయోగాలపై బుధవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రతి పథకం అందాలని అన్నారు. వైఎస్సార్ ఉచిత పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, ధాన్యం కొనుగోలు వంటివి పక్కాగా జరిగాన్నారు. ఈ నెల 15వ తేదీలోగా ఈ పంట నమోదు ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. తహసీల్దార్ టి.సత్యనారాయణ, ఉద్యానవన అధికారి అనూష, ఏఎస్‌వో శ్రీనివాస్ పాల్గొన్నారు.

జర్నలిజం సమాజానికి ఉపయోగపడాలి


సంపాదకుల గ్యాలరీని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్సీ శర్మ

ఎచ్చెర్ల క్యాంపస్: జర్నలిజం సమాజానికి ఉపయోగపడాలని మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్.శర్మ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలోని జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ విభాగాన్ని బుధవారం సందర్శించారు. సంపాదకీయుల గ్యాలరీ పరిశీలించిన అనంతరం విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. మారుతున్న కాలానుగుణంగా జర్నలిస్టులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. భాష, సాహిత్యంపై పట్టుసాధించాలన్నారు. జర్నలిజం సహాయ ఆచార్యులు రెడ్డి తిరుపతిరావు, గుంట లీలావరప్రసాద్ ఉన్నారు.

ఊరూరా 'నామట్టి-నాదేశం'


రణస్థలం: కోష్టలో సేకరించిన మట్టికి వందనం చేస్తున్న సీతారాం తదితరులు

ఎచ్చెర్ల క్యాంపస్: పచ్చదనం, పరిశుభ్రతతోనే గ్రామాల ప్రగతి సాధ్యమని శ్రీకాకుళం రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు అన్నారు. జాతీయ సేవాపథకం ఆధ్వర్యంలో 'మేరా మిట్టీ- మేరా దేశ్' కార్యక్రమంలో భాగంగా ఎచ్చెర్ల, కేశవరావుపేట, కంచరాం గ్రామాల్లో బుధవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. సామాజిక బాధ్యతగా మొక్కలు నాటడంతోపాటు వాటిని సంరక్షించాలన్నారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థులు గ్రామాల్లో పర్యటించి పారిశుద్ధ్యం, పచ్చదనంపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఓఎస్‌డీ ఎల్.సుధాకర్‌బాబు, ఏవో ముని రామకృష్ణ, అకమడిక్ డీన్ మోహన్‌కృష్ణ పాల్గొన్నారు.

మెరుగైన సౌకర్యాలు

జి.సిగడాం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న నామట్టి-నాదేశం కార్యక్రమం ద్వారా ప్రజలకు మెరుగైన సౌకర్యాలు సమకూరుతాయని మండల ప్రత్యేక ఆహ్వానితుడు మీసాల వెంకటరమణ అన్నారు. పచ్చదనం పరిశుభ్రత అందరి బాధ్యత అని చెప్పారు. జి.సిగడాం సచివాలయం ఆవరణలో ఉపాధి హామీ పథకం ద్వారా ఏర్పాటు చేసిన నామట్టి-నాదేశం ఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాతావరణం కలుషితం కాకుండా ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. స్థానిక సర్పంచ్ ముద్దాడ ఈశ్వరమ్మ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరాడ వెంకటరమణ, జేసీఎస్ కన్వీనర్ డోల వెంకటరమణ, మండల వ్యవసాయసలహా మండలి చైర్మన్ మక్క వెంకటిసాయి, వైస్ ఎంపీపీ తోలేటి వెంకటరావు, ఎంపీడీవో నిశ్చల, ఈవోపీఆర్డీ ఎస్.శ్రీనివాసరావు, ఏపీవో చోళ్ల సత్యన్నారాయణ, ఈసీ గేదెల పురుషోత్తంనాయుడు పాల్గొన్నారు.

అమరుల త్యాగాలను స్మరిద్దాం

రణస్థలం: భారతదేశ స్వాతంత్ర్యం కోసం అమరులైన త్యాగమూర్తులను స్మరించుకోవడం మనందరి బాధ్యతని జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం అన్నారు. కోష్ట, వల్లభరావుపేట గ్రామాల్లో నామట్టి-నాదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేలతల్లికి నమస్కరించుకోవడం, స్వాతంత్ర్య వీరులకు వందనం సమర్పించడం ఎంతో పుణ్యమన్నారు. స్వచ్ఛమైన గాలి, నీరు, సాగువంతమైన నేలను భావితరాలకు అందిద్దామన్నారు. అనంతరం మట్టిని పట్టుకుని ప్రతిజ్ఞ చేశారు. వసుదాకు వందనంలో భాగంగా మొక్కలు నాటారు. అమర వీరుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపీవో ఎం.శ్రీనివాసనాయుడు, ఎంపీడీవో ఆర్.వి.రమణమూర్తి, ఏవో ధనుంజయరావు, కోష్ట సర్పంచ్ పిషిణి చిన్నంనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు మహంతి పెదరామినాయుడు, పైడి శ్రీనివాసరావు, మహిళా అధ్యక్షురాలు గురాన మానస, నాయకులు పిషిణి లక్ష్మణరావు, పల్లె లక్ష్మణ, పిషిణి పెంటంనాయుడు, మహంతి సత్యనారాయణ, గురాన చిరంజీవి, గడి బలరాం, కిల్లారి సన్యాసినాయుడు, గ్రామ సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ఇబ్రహింబాద్‌లో..

ఎచ్చెర్ల: ఇబ్రహింబాద్ గ్రామంలో నామట్టి-నాదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా శిలాఫలకాన్ని ఎంపీపీ మొదలవలస చిరంజీవి ఆవిష్కరించారు. భావితరాలకు ప్రతి ఒక్కరు స్వచ్ఛమైన గాలి, నీరు, నేల, వాతావరణం అందించాలని, సామాజిక బాధ్యతగా మొక్కలు నాటాలన్నారు. అనంతరం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. అనంతం రిటైర్డు ఆర్మీ ఉద్యోగులను సత్కరించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు మురళీధర్‌బాబా, పీఏసీఎస్ అధ్యక్షుడు సనపల నారాయణరావు, ఎంపీడీవో రమాదేవి, ఉపాధిహామీ ఏపీవో శోభాదేవి, ఎంపీటీసీ సభ్యుడు సూర వెంకటరమణ, నాయకులు సూర అప్పారావు, సీపాన ఎర్రన్నాయుడు పాల్గొన్నారు.


ఎచ్చెర్ల క్యాంపస్: ఎస్ఎంపురంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జగదీశ్వరరావు


జి.సిగడాం: మొక్కను నాటుతున్న దృశ్యం


ఎచ్చెర్ల: అమరవీరుల కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

వినియోగదారుల సమస్యల పరిష్కారమే ధ్యేయం



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న సత్యనారాయణ

ఎచ్చెర్ల క్యాంపస్: వినియోగదారుల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యమని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం (ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ, విశాఖపట్నం) చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి డాక్టర్ బి.సత్యనారాయణ అన్నారు. శ్రీకాకుళం రూరల్ సబ్ డివిజన్ పరిధిలోని కుశాలపురం సమీపంలో పాలిటెక్నిక్ కళాశాల వెనుక ఉన్న డీ-3 కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల పరిష్కారం వేదికను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం ఎచ్చెర్లలోని వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం ప్రాధాన్యంపై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. వినియోగదారుల నుంచి సమస్యలు తెలుసుకోవడానికి పరిష్కార వేదికలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలో ఈ ఏడాది జూలై నాటికి 279 ఫిర్యాదులు రాగా..వీటిలో 208 పరిష్కరించామన్నారు. మిగిలినవి పరిశీలనలో ఉన్నాయని చెప్పారు. 2004లో ఏర్పాటైన సమస్యల పరిష్కార న్యాయస్థానానికి ఇప్పటి వరకు 7,505 ఫిర్యాదులు రాగా 7,434 పరిష్కరించినట్టు చెప్పారు. విద్యుత్ శాఖ తప్పులు ఉంటే ఫిర్యాదుదారులకు నష్టపరిహారం సైతం అందజేస్తున్నట్లు వివరించారు. వినియోదారులకు ఏమైనా సమస్యలు ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 1912కు ఫోన్ చేసి తెలియజేయవచ్చునన్నారు. ఫిర్యాదు అందిన 60 రోజుల్లోగా పూర్తివిచారణ చేస్తామన్నారు. ఎక్కువగా బిల్లింగ్ లోపాలు, విద్యుత్ సరఫరాలో హెచ్చు తగ్గులు, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పు, మీటర్లలో లోపాలు, కొత్త సర్వీసులు, అదనపు లోడు మంజూరు, కేటగిరీ, యజమానిపేరు మార్పుపై ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులు అధికారులకు ఫిర్యాదు చేసినప్పుడు రశీదు పొందాలన్నారు. కార్యక్రమంలో సభ్యులు ఎస్.హరిబాబు, డాక్టర్ రాయసం నరేంద్రకుమార్, వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.సి.వి.రమణమూర్తి నాయుడు, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

సమస్యలను పక్కదారి పట్టిస్తున్న కేంద్రం


మాట్లాడుతున్న ఎం.వి.ఎస్.శర్మ

ఎచ్చెర్ల క్యాంపస్: కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం సమస్యలను పక్కతోవ పట్టించే ప్రయత్నం చేస్తోందని మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్.శర్మ అన్నారు. బీఆర్ఏయూలో గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం, జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో దేశంలో యూనిఫాం సివిల్ కోడ్ అనే అంశంపై బుధవారం సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఏపీకి ప్రత్యేక హోదా, ఇతర విభజన హామీలు నేర వేర్చడంలో విఫలమైందన్నారు. అబద్ధాలను నిజాలుగా మార్చేందుకు ప్రయత్నిస్తుందని వ్యాఖ్యానించారు. కుల, మతాలను వర్గాలుగా విభజించి శత్రుత్వాన్ని పెంచుతోందన్నారు. మతాల వ్యక్తిగత అంశాలను గౌరవించాలన్నారు. ప్రస్తుతం ఉమ్మడ పౌరస్మృతి చట్టం ఎంతవరకు అవసరమని ప్రశ్నించారు. గ్యాస్, పెట్రోల్ ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, నిరుద్యోగ సమస్య, పేదరికం, ఆకలి చావులు వంటి సమస్యలు పట్టించుకోవటం లేదన్నారు. కార్పొరేట్ శక్తులకు మద్దతుగా నిలుస్తున్నారని విమర్శించారు. విద్య, వైద్యం, సామాజిక అసమానతులపై దృష్టిపెట్టాలని సూచించారు. మణిపూర్ రగిలిపోతున్నా ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడేందుకు, ఆప్రాంతాన్ని సందర్శించేందుకు ఎందుకు ముందుకు రావటం లేదని ప్రశ్నించారు. కృత్రిమ మేధస్సును ప్రోత్సహిస్తే భవిష్యత్తులో నిరుద్యోగ సమస్య పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వర్సిటీ న్యాయవిభాగం గరిమెల్ల విజ్ఞాన కేంద్రం అధ్యక్షుడు వి.జి.కె.మూర్తి, రేడెంట్ హెల్త్ కేర్ డాక్టర్ అదిప్ హసన్, వర్సిటీ న్యాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ వై.రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ధర్మశాస్తా ఆలయంలో పూజలు


ప్రత్యేక అలంకరణలో అయ్యప్పస్వామి


గణపతి హోమం చేస్తున్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళంలోని ధర్మశాస్తా దేవాలయంలో బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. అయ్యప్పస్వామికి భక్తులు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. గణపతి హోమం చేశారు. ముందుగా స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు, సహస్రనామార్చనలు జరిగాయి. ఆలయ ధర్మకర్త ఎల్.నందికేశ్వరరావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్ పోషణ కిట్ల పంపిణీ


పోషణ కిట్లను అందజేస్తున్న దృశ్యం

లావేరు: గుమడాం గ్రామంలో గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను ఉప సర్పంచ్ దురగాసి ధర్మారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగం కనకరాజు, ముప్పిడి శ్రీరాములు, జగ్గురోతు తవిటినాయుడు బుదవారం పంపిణీ చేశారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

పశువులకు లంపీ స్కిన్ నివారణ టీకాలు


రావివలసలో పశువులకు టీకాలు వేస్తున్న సిబ్బంది

లావేరు: పాడి రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని వైఎస్సార్‌సీపీ మండల ప్రదాన కార్యదర్శి దేశెట్టి తిరుపతిరావు అన్నారు. రావివలస, వాల్లేపేట, లింగాలవలస, లావేరు గ్రామాల్లో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో వెటర్నరీ అసిస్టెంట్లు పశువులకు ఉచితంగా లంపీ స్కిన్ వ్యాధి నిరోధక టీకాలను బుధవారం వేశారు. రావివలస జరిగిన కార్యక్రమాన్ని తిరుపతిరావు పరిశీలించారు. వెటర్నరీ అసిస్టెంట్ జి.లక్ష్మీకాంతం, జి.గోపాల్, రమేష్, సిబ్బంది ఎం.జగదీష్ పాల్గొన్నారు.

మోసగించిన వ్యక్తిపై కేసు

గార: ఉద్యోగాల పేరిట మోసగించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు గార ఎస్సై ఎస్.కామేశ్వరరావు బుధవారం తెలిపారు. వత్సవలస గ్రామానికి చెందిన మైలపల్లి ఎర్రయ్యదాసు నుంచి ఇద్దరు యువకులకు పోర్టులో ఉద్యోగాలు కల్పిస్తానని చెప్పి దీపావళి గ్రామానికి చెందిన నల్లాన సతీష్ రూ.12 లక్షల నగదు తీసుకున్నారు. ఏడాదిన్నర గడిచినా ఇప్పటి వరకు సతీష్ ఉద్యోగాలు కల్పించలేదు. ఇచ్చిన డబ్బులైనా తిరిగి ఇవ్వలేదు. దీంతో సతీష్‌పై స్థానిక పోలీసులకు ఎర్రయ్యదాసు ఫిర్యాదు చేశారు. దీంతో సతీష్‌పై చీటింగ్ కేసు నమోదు చేశామని ఎస్సై చెప్పారు.

పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు


పోతయ్యవలసలో పిల్లలకు టీకా వేస్తున్న దృశ్యం

లావేరు: వ్యాక్సినేషన్‌తో వ్యాధులు రాకుండా నివారించవచ్చునని లావేరు పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టరు మణిభూషణ్ అన్నారు. పీహెచ్‌సీ పరిధిలోని పలు గ్రామాల్లో పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలను వేసే ప్రక్రియను బుధవారం చేపట్టారు. ఈసందర్భంగా వైద్యుడు మాట్లాడుతూ.. పిల్లలకు డిఫ్తీరియా, పోలియో, తట్టు, చికెన్‌పాక్స్ వంటి వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ఉచితంగా వ్యాక్సినేషన్ చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

భూముల పరిశీలన


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న వేణుగోపాలరావు

జి.సిగడాం: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన స్పందనలో వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే విచారణ చేసి పరిష్కరించాలని తహసీల్దార్ పప్పల వేణుగోపాలరావు సిబ్బందికి సూచించారు. గెడ్డకంచరాం గ్రామంలోని 214 సర్వే నంబర్లో 16 మంది ఎస్సీలకు 1979 సంవత్సరం నుంచి భూములు ఉన్నాయని వాటిని వారికి ఇప్పించాలని, సర్వే నంబర్ 212లో 26 ఎకరాలు ఉన్నాయని.. ఈ భూములు రాజుల స్వాధీనంలో ఉన్నందున వీటిని పరిశీలించాలని గ్రామ మాజీ సర్పంచ్ నక్క ప్రసాదరావు జిల్లా కలెక్టర్ నిర్వహించే స్పందనలో ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఆయా భూములను తహసీల్దార్ బుధవారం పరిశీలించారు. స్థానికులతో మాట్లాడారు. అనంతర తన కార్యాలయంలో వీఆర్వోలు, సర్వేయర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామాల్లో చిన్న చిన్న సమస్యలను గుర్తించి వాటిని సచివాలయం పరిధిలోనే పరిష్కారం చేయాలన్నారు. ఆర్ఐ రామచంద్రరావు, వీఆర్వోలు పొట్నారు జగన్‌మోహన్, భూపతి నర్సింగరావు పాల్గొన్నారు.

అమరులను స్మరించుకుందాం


జెండాను ఆవిష్కరిస్తున్న సత్యవతి

శ్రీకాకుళం అర్బన్: దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసి అమరులైన వారి త్యాగాలను స్మరించుకోవాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని డీసీసీ అధ్యక్షురాలు బొడ్డేపల్లి సత్యవతి అన్నారు. క్విట్ ఇండియా డే సందర్భంగా బుధవారం శ్రీకాకుళంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్ వద్ద కాంగ్రెస్ పార్టీ జెండాను బుధవారం ఆవిష్కరించి మాట్లాడారు. అలాగే యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రెల్ల సురేష్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ నాయకులు దేశేళ్ల గోవింద మల్లిబాబు, కోత మధుసూదనరావు, బస్వా షణ్ముఖరావు, బొత్స రమణ పాల్గొన్నారు.

11న రౌండ్ టేబుల్ సమావేశం



మాట్లాడుతున్న సూర్యం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మేక్ ఇన్ ఇండియా పేరుతో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇప్పటివరకు ఒక్క నోటిఫికేషన్ ఇవ్వకపోవడం దారుణమని నిరుద్యోగ పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలసముద్రం సూర్యం అన్నారు. ఈ మేరకు శ్రీకాకుళం నగరంలో క్రాంతిభవన్‌లో బుధవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరుతూ ఈ నెల 11న విశాఖపట్నంలో నిరుద్యోగపోరాట సమితి ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దీనికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు.

బాలలను పనిలో పెట్టవద్దు


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం క్రైమ్: బాలలను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం (ఏహెచ్‌టీయూ) ఎస్సై కేశవరావు అన్నారు. నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్సు సమీపంలో సురవరపు ఈశ్వరరావు బైక్ పార్కింగ్ నడుపుతున్నాడు. ఇక్కడ ఓ బాలుడిని పనిలో పెట్టుకున్నట్టు తెలుసుకున్న పోలీసులు బుధవారం అక్కడకు వెళ్లి కౌన్సెలింగ్ చేశారు. బాలుడి తల్లిదండ్రులను పిలిపించి మాట్లాడారు. సీడబ్ల్యూసీ వారి వద్ద హాజరు పరిచారు. ఎస్సై మాట్లాడుతూ.. 18 ఏళ్ల లోపు వారిని పనుల్లో పెట్టుకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. దిశ మహిళ కానిస్టేబుల్ పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న విద్యాసాగర్

గార: ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు, జీవనోపాధి మెరుగుపడేందుకు ఇస్తున్న శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ డీవీ విద్యాసాగర్ అన్నారు. స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో గ్రామైఖ్య సంఘం అధ్యక్షులు, వీఓఏలకు రెండు రోజుల పాటు నిర్వహించే ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ పాలసీపై ఇస్తున్న శిక్షణను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంఘాలు ఏ గ్రేడ్‌లో నిలబడాలంటే నిబంధనలు పాటించాలన్నారు. ఫైనాన్షియల్ డీపీఎం శ్రీనివాసబాబా, ఏసీ కొండలరావు, ఏపీఎం, సీసీలు పాల్గొన్నారు.

నామినేషన్ దాఖలు


నామినేషన్ పత్రాన్ని అందజేస్తున్న శ్రీనివాసరావు

జి.సిగడాం: దవళపేట గ్రామ పంచాయతీ మూడో వార్డు సభ్యుడి పదవికి జరగనున్న ఎన్నిక కోసం కంచరాన శ్రీనివాసరావు బుధవారం నామినేషన్ వేశారు. ఆ గ్రామ సచివాలయంలో పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి అరసాడ రవికి పత్రాలను అందించారు. వార్డు సభ్యుడు మృతితో ఇక్కడ ఎన్నిక అనివార్యమైంది. ఎంపీడీవో నిశ్చల, ఈఓపీఆర్డీ ఎస్.శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పేడాడ శ్రీరామమూర్తి, శ్యామలరావు, బొడ్డేపల్లి ఉదయ్‌కుమార్, కంచరాన రమణారావు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల పరామర్శ


పరామర్శిస్తున్న రామ్‌మనోహర్‌నాయుడు

గార: బలరాంపురం గ్రామానికి చెందిన మత్స్యకారుడు మైలపల్లి అప్పయ్య ఇటీవల మృతి చెందారు. దీంతో వారి కటుంబ సభ్యులను వైఎస్సార్‌సీపీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు బుధవారం పరామర్శించారు. అలాగే కొర్లాం గ్రామానికి చెందిన ముద్దపు సావిత్రమ్మ మృతి చెందడంతో వారి కుటుంబసభ్యులను కూడా పరామర్శించి సానుభూతి తెలియజేశారు. ఎంపీపీ గొండు రఘురామ్, నాయకులు పీస శ్రీహరిరావు, గొలివి వెంకటరమణమూర్తి, కోనాడ నర్సింహులు, శిమ్మ ధర్మరాజు, కోట రామారావు, రవి ఉన్నారు.

వసతి గృహాల సందర్శన

జి.సిగడాం: జి.సిగడాం బీసీ, మోడల్ పాఠశాల, సంతవురిటి బీసీ వసతి గృహాలను రాష్ట్ర ఆహార కమిటీ సభ్యుడు బి.కాంతారావు బుధవారం సందర్శించారు. మెనూను పరిశీలించారు. సంతవురిటి వసతి గృహం వార్డెన్ గుంటుకు ప్రభాకర్ పని తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. మౌలిక సదుపాయలు, మెనూ అమలు బాగుందన్నారు. జిల్లా సివిల్ సప్లయ్ డి.ఎం.శ్రీనివాసరావు తదితరులున్నారు.